సాక్షి పల్నాడు

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



అయ్యప్ప స్వామికి పల్లకీ సేవ

బాపట్ల: భీమవారిపాలెం కోదండ రామాలయంలో గురువారం అయ్యప్ప పల్లకీ సేవ నిర్వహించారు. 300 మంది స్వాములు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ పల్లకీ మోశారు.



ఐలవరంలో నగర సంకీర్తన

భట్టిప్రోలు: ఐలవరంలో ధనుర్మాసం పురస్కరించుకుని రోజూ నగర సంకీర్తన జరుగుతుంది. ఈ మాసంలో విష్ణు సంకీర్తన వల్ల శుభాలు కలుగుతాయని అర్చకులు వివరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 578.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,298 క్యూసెక్కులు విడుదలవుతోంది.

హే భగవానా..!



వర్షంలో తడిసిన ధాన్యాన్ని చూసి వేదన చెందుతున్న రైతు

దాచేపల్లి : అకాల వర్షం అన్నదాతలను నిండా ముంచింది. మార్కెట్ యార్డులో ఆరబెట్టుకున్న ధాన్యపురాశులను గురువారం తెల్లవారుజామున తడిపి ముద్దచేసింది. పూటగడిస్తే పంటను అమ్ముకునేవారమని, ఇంతలోనే వరుణుడు కన్నెర్ర చేశాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దాచేపల్లి, కారంపూడి మండలాల్లోని రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు నడికుడి మార్కెట్ యార్డులో ఉన్న 15 ఎకరాల్లోని సిమెంట్ ప్లాట్‌ఫాంను వినియోగించుకుంటారు.

ముంచిన అకాల వర్షం

- నడికుడి మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యపురాశులు
- 3 వేల బస్తాలకుపైగా నష్టం
- అన్నదాతలకు మిగిలిన కన్నీరు

ప్రస్తుతం సుమారు మూడు వేలకుపైగా బస్తాల ధాన్యాన్ని రైతులు అక్కడ ఉంచారు. ధాన్యం ఆరిన తర్వాత బస్తాల్లోకి ఎత్తి అమ్ముకోవచ్చని ఆశించారు. అయితే వారి ఆశలను వాన అడియాసలు చేసింది. గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఆ ధాన్యం అంతా తడిసిపోయింది. వేకువజామున వాన కురవడంతో రైతులు పంటను కాపాడుకోలేకపోయారు. వర్షం ధాటికి ధాన్యపు గింజలు నీటిలో కొట్టుకుపోయాయి. దీంతో మార్కెట్‌యార్డు అధికారులు బాధిత రైతులను కలిసి జరిగిన నష్టంపై వివరాలు సేకరించారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని, తేమ శాతాన్ని పట్టించుకోకుండా పూర్తిగా పాడైన ధాన్యాన్నీ కొనాలని, 75 కేజీల బస్తాకు రూ.2,000 ధర చెల్లించాలని కోరుతున్నారు.



తడిసిన ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తి ట్రాక్టర్లలో తరలిస్తున్న రైతులు



తడిసిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపుతున్న రైతులు

అదనపు ఖర్చు పెరిగింది



18 ఎకరాల్లో వరి సాగు చేశాను. 250 బస్తాలకుపైగా పంట దిగుబడి వచ్చింది. పంట పచ్చిగా ఉండటంతో ఆరబెట్టేందుకు మార్కెట్ యార్డుకు తీసుకువచ్చా. వర్షంతో ధాన్యపు గింజలు తడిసిపోయాయి. ఇప్పుడు బస్తాకు అదనంగా రూ.200 వరకు కూలీ ఖర్చు చేయాల్సిన దుస్థితి. పూర్తిగా తడిసిన ఈ పంటను మరో 10 రోజులు ఆరబెట్టినా ఫలితం అంతంతే. ఏం చేయాలో పాలుపోవడం లేదు. సర్కారు ఆదుకోవాలి.

– నజ్జు సాంబశివరావు, రైతు, వీరాపురం.

ఒక్కరోజు ఆగితే బస్తాలకు పట్టేవాళ్లం



13 ఎకరాల్లోని పంట 300 బస్తాలను మార్కెట్ యార్డులో ఆరబెట్టాను. ఒక్కరోజు ఆగితే బస్తాల్లోకి పట్టేవాడిని. పంట మొత్తం కళ్లెదుటే వానలో తడిసి పోయింది. భారీగా నష్టపోయా. ధాన్యాన్ని కాపాడుకునేందుకు చేసిన యత్నాలు ఫలించలేదు. సర్కారే ఆదుకోవాలి.

– వడ్డేంపూడి శ్రీనివాసరావు, రైతు, వీరాపురం

ఊహించని నష్టం



10 ఎకరాల్లో సాగు చేసిన ధాన్యాన్ని తీసుకొచ్చి ఇక్కడ ఆరబెట్టాను. పచ్చి గింజంతా ఎండిపోయింది. ఈ ఒక్కరాత్రి గడిస్తే తెల్లవారే కూలీలతో బస్తాలను పట్టించి కొన్ని విక్రయించి మరికొన్ని గోడౌన్‌లో భద్రపరుద్దామని అనుకున్నా. కానీ ఇంతలోనే ఊహించని నష్టం ఎదురైంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చిమాట గోపి, రైతు, గామాలపాడు.

న్యూస్‌రీల్

ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడే అవకాశం

పరీక్ష పే చర్చా కోసం పేర్ల నమోదు

యడ్లపాడు: 'పరీక్షా పే చర్చా –2025' కార్యక్రమం ద్వారా ఇకపై విద్యా విషయాలపై భారత ప్రధాని నరేంద్రమోదీతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా నోడల్ అధికారులు తెలిపారు. బోయపాలెం జిల్లా విద్యాశిక్షణ సంస్థలో ఆయా కార్యక్రమ వివరాలను బుధవారం వెల్లడించారు. సెకండరీ విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు ఈనెల 14 నుంచి 2025 జనవరి 14వ తేదీ వరకు నెలరోజులపాటు ఈ కార్యక్రమం నిర్విరామంగా నిర్వహించాల్సి ఉంటుంది. మూడు జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతి ఒక్కరూ తమ పేర్లను నేరుగా పరీక్షా పే చర్చా –2025 వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులూ ఇందులో నమోదు చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న విద్యాపరమైన ప్రశ్నలను అడగవచ్చని, ఉత్తమ మైన ప్రశ్నలను ఎంపిక చేసి విద్యార్థులతో ప్రధాని ముఖాముఖీ చర్చల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నోడల్ అధికారులుగా డాక్టర్ కె. ప్రసాద్, యోగేశ్వర రావు, ఆర్.శ్రీనివాసరావును నియమించినట్లు వివరించారు.

తాడికొండ- కంతేరు రోడ్డుకు మరమ్మతులు



తాడికొండ: తాడికొండ- కంతేరు రోడ్డుకు ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. 4 నెలల క్రితం వచ్చిన భారీ వరదలకు కొండవీటి వాగుకు వరద పోటెత్తి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మరమ్మతులు పేరుతో టీడీపీ నాయకులు రాళ్లు, ఫ్లైయాష్ డస్ట్ వేసి చేతులు దులుపుకోగా నాటి నుంచి నేటి వరకు పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. సాక్షిలో కథనాలు ప్రచురితం కావడంతో ఎట్టకేలకు స్పందించిన అధికారులు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.

9 మందికి ఐదేళ్ల కారాగార శిక్ష

బాపట్ల: పొన్నూరులోని కోదండ రామాలయం నిధుల విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంలో 9 మందికి ఐదేళ్ల వంతున కారాగార శిక్ష విధిస్తూ బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి గురువారం తీర్పు చెప్పారు. 2019లో దేవాలయం నిధుల విషయంలో 17 మందిపై పొన్నూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై వాదోపవాదాలు జరగగా.. 9 మందికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలవరించారు.

ప్రతి రైతుకు యూనిక్ ఐడీ



ఫిరంగిపురం: ప్రతి రైతుకు యూనిక్ ఐడీ నంబరును సిబ్బంది తప్పని సరిగా ఇవ్వాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. నుదురుపాడు సచివాలయం వద్ద గురువారం వ్యవసాయ శాఖ, కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రైతులకు ప్రత్యేక ఐడీ నంబరు ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీరావు మాట్లాడారు. మండలంలోని నుదురుపాడు, మేరికపూడి, గుండాలపాడు, వేమవరం గ్రామాలను కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు చెప్పారు. దీని ద్వారా గ్రామాల్లోని రైతులందరికి గ్రామ వ్యవసాయ సహాయకులు , ఇతర సిబ్బంది యూనిక్ ఐడీ ఇవ్వాలని సూచించారు. ప్రధాన మంత్రి కిసాన్ యోజన కింద రూ.6 వేల గ్రాంటు ఇస్తారని తెలిపారు. వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ కె.విజయలక్ష్మి, సంయుక్త సంచాలకుడు బాల సుబ్రహ్మణ్యం , జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు టి. శ్రీనివాస రావు, ఏవో వాసంతి, సుబాని, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అ'పూర్వ' పలకరింత.. ఆత్మీయ పులకింత

1999 బ్యాచ్ గుంటూరు వైద్య కళాశాల విద్యార్థుల సమ్మేళనం



గుంటూరు మెడికల్: వారంతా గుంటూరు వైద్య కళాశాలలో 1999 బ్యాచ్ వైద్య విద్యార్థులు.. గురువారం సమావేశమైన వేళ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సందడి చేశారు. ఒకరినొకరు పలకరించుకుని.. ఆత్మీయత చాటుకున్నారు. సుమారు ఏడాది పాటు ప్రణాళికా బద్ధంగా జరిగిన కృషి ఫలితంగా సిల్వర్ జూబ్లీ రీ యూనియన్ పేరుతో కలుసుకుని సంబరాలు చేసుకున్నారు. కళాశాల ఆవరణలోకి అడుగు పెట్టగానే నాలుగు పదులు దాటిన వారు కూడా యువతలా మారిపోయారు. కళాశాల జింఖానా ఆడిటోరియంలో గురువారం ఈ అపూర్వ కార్యక్రమానికి వేదికైంది. ఇప్పటికే ఈ బ్యాచ్ రూ. 80 లక్షలతో కొనుగోలు చేయించిన బస్సులను ప్రారంభించారు. మెన్స్, ఉమెన్స్ హాస్టల్‌లో క్రికెట్ ప్రాక్టీస్, షటిల్ కోర్టులను సుమారు రూ. 10 లక్షలతో ఏర్పాటు చేయించారు. పలు వైద్య విభాగాల్లో లెక్చరర్ గ్యాలరీలను ఆధునీకరించి వైద్య పరికరాలను సైతం అందజేశారు. సుమారు రూ. 2 కోట్ల మేరకు విరాళాలు అందజేసి అందరి మన్ననలు పొందారు. జింఖానా సభ్యుడు డాక్టర్ పాదిల ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి వీరి సేవలను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి, వైస్ ప్రిన్సిపల్స్ ప్రభాకర్, శ్రీధర్ కూడా ప్రశంసించారు. కార్యక్రమంలో వైద్యులు భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, భుక్యా సునీల్‌కుమార్ నాయక్, కందుల రామ్, గోపతి నాగేశ్వర రావు, పద్మజ, ప్రసన్న లక్ష్మి, అమరేశ్వరి, ఇందిర వరలక్ష్మి, అమిత, శ్రీలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దాహం తీరనది



కోనూరు రీచ్‌లో నదికి అడ్డంగా వేస్తున్న మట్టి రోడ్డు

- ఇసుక కోసం కృష్ణా నదిలో మట్టి రోడ్డు
- యథేచ్ఛగా నిబంధనలకు పాతర
- దిగువ భూములకు అందని సాగునీరు
- ఒక రీచ్ మూతపడింది.. రెండోదాన్ని తెరిచేందుకు సన్నాహాలు
- నిస్సహాయ స్థితిలో అధికారులు
- వాటాలు కుదరకనే.. అక్రమాలు బహిర్గతం!

అచ్చంపేట: తెలుగు తమ్ముళ్ల ఇసుక దోపిడీ దాహం తీరడం లేదు. కృష్ణానదిలోకి యథేచ్ఛగా అడ్డదారులు వేసి మరీ ఇసుక తవ్వకాలకు సిద్ధమవుతున్నారు. ఒక రీచ్ మూతపడితే మరొకటి.. అదీ మూతపడితే ఇంకోటి.. వెనక్కి తగ్గేదె లే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అడ్డువస్తే సొంత పార్టీ వాళ్లయినా సరే అంతుచూస్తామనే రీతిలో రెచ్చిపోతున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా కృష్ణానదిలో అడ్డంగా మట్టి రోడ్లు వేస్తున్నా, యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేస్తున్నా.. అధికారులు అడిగే సాహసం చేయడం లేదు. దీనివల్ల దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీల భూములకు నీళ్లు అందడం లేదు.

మూతపడిన అంబడిపూడి రీచ్

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు లోబడి నియోజకవర్గంలో ఎనిమిది రీచ్‌లకు అనుమతి ఉంటే అచ్చంపేట మండలంలో మొత్తం నాలుగు ఇసుక రీచ్‌లకు అనుమతి లభించింది. కోనూరు ఇసుక రీచ్‌ని సాయి అండ్ క్యూ సొల్యూషన్స్ సంస్థ దక్కించుకుంది. అక్టోబర్ నుంచే ఈ సంస్థ వినియోగదారులకు ఇసుకను సరఫరా చేయాలి. కానీ ఇప్పటివరకు రీచ్‌ని ప్రారంభించలేదు. అంబడిపూడి-1 రీచ్‌ని గోదావరి కృష్ణా వాటర్ వర్క్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు సంస్థ దక్కించుకుంది. రెండు నెలలుగా ఇసుక సరఫరా చేసింది. ఈ రీచ్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద యంత్రాలను వినియోగించి నదీ గర్భంలో తవ్వకాలు సాగించడంతో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు చేసి ఐదు పెద్ద పొక్లెయిన్లతోపాటు కొన్ని లోడ్ లారీలను సీజ్ చేసి అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఈ రీచ్ నుంచి లారీల ద్వారా ఇసుక రవాణా పూర్తిగా ఆగిపోయింది. అమరావతి మండలంలోని రీచ్ కూడా ఇలాగే అక్రమాల వల్ల మూతపడిన విషయం తెలిసిందే.

రెండు కిలోమీటర్ల మేర రోడ్డు

అంబడిపూడి రీచ్ నుంచి ఇసుక రవాణా ఆగిపోవడంతో కోనూరు రీచ్‌లో తెలుగు తమ్ముళ్లు అక్రమాలకు తెగబడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే నిబంధనలకు విరుద్ధంగా కృష్ణా నదిలో అడ్డంగా సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వేశారు. నీళ్లు పోయేందుకు రోడ్డు కింద నుంచి పెద్ద పెద్ద సిమెంట్ పైపులు వేశారు. పైన రెండు అడుగుల మందాన మట్టిపోసి రోలింగ్ చేశారు. మట్టి జారిపడకుండా సైడ్స్ సపోర్టులు ఏర్పాటు చేశారు. ఇంకా ఒకటి రెండు రోజులలో రీచ్‌లో ఇసుక తవ్వకాలకు సిద్ధపడుతున్నారు. నదిలో అడ్డంగా రోడ్డు వేయడంతో దిగువన ఉన్న సాగు భూములకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏమీ చేయలేక చేష్టలుడిగి చూస్తున్నారు.

వాటాల్లో విభేదాల వల్లే

తెలుగు తమ్ముళ్ల మధ్య వాటాల పంపిణీలో తలెత్తిన విభేదాల వల్లే అంబడిపూడి రీచ్ మూతపడిందని స్థానికులు భావిస్తున్నారు. వాళ్లలో వాళ్లే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకుని రీచ్‌ను మూయించినట్లు తెలుస్తోంది. కోనూరు రీచ్‌లోనూ కృష్ణానదికి అడ్డంగా రోడ్డు వేసిన విషయమూ ఆ పార్టీ వారి నుంచే బయటకు వచ్చినట్టు సమాచారం.


నదిలో రోడ్డు వేయడం చట్ట విరుద్ధం




కోనూరు రీచ్‌లో కృష్ణానదికి అడ్డంగా రోడ్డు వేయడం చట్ట విరుద్ధం. రోడ్డు పనులను నిలిపివేశాం. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరగకుండా చర్యలు చేపట్టాం. అక్రమార్కులు మాట వినకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

– జి.శ్రీనివాసయాదవ్, తహసీల్దార్, అచ్చంపేట.

నాగార్జున సా'గరం'



- రేపు ప్రాజెక్టు కమిటీ ఎన్నిక
- ఛైర్మన్ పదవి కోసం పోటాపోటీ
- టీడీపీలో కుదరని ఏకాభిప్రాయం
- పట్టుబడుతున్న నలుగురు సీనియర్ నేతలు
- తమ వర్గానికే ఇవ్వాలంటున్న ఎమ్మెల్యేలు కన్నా, చదలవాడ, జూలకంటి, యరపతినేని
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి వద్ద తెగని పంచాయితీ
- చంద్రబాబు నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్న మంత్రి
- డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలపై అసంతృప్తిలో జనసేన క్యాడర్



నాగార్జున సాగర్ డ్యాం ఫైల్

సాక్షి, నరసరావుపేట: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కమిటీ(పీసీ) ఛైర్మన్ పదవి కోసం తెలుగుదేశం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. కూటమి నేతల అప్రజాస్వామిక విధానాలను ఎండగడుతూ ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ సాగునీటి సంఘాల ఎన్నికలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. దీంతో కూటమి నేతలు దౌర్జన్యంగా సంఘాలను ఏకగ్రీవం చేసుకున్నారు. ఈ నెల 14న డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు పూర్తి కావడంతో ప్రస్తుతం సాగర్ పరిధిలో కీలకమైన ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పదవి కోసం సొంత పార్టీలోనే కుమ్ములాటలు మొదలయ్యాయి. ఛైర్మన్ పదవిని ఉమ్మడి గుంటూరు జిల్లాకు కేటాయిస్తే వైస్ ఛైర్మన్ పదవిని ప్రకాశం జిల్లాకు ఇవ్వడం ఆనవాయితీ. సాగర్ కుడికాలువ పరిధిలో మొత్తం 48 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 32, ప్రకాశం జిల్లా పరిధిలో 16 డీసీలు ఉన్నాయి. ఈ 48 మంది డీసీ ఛైర్మన్‌లు ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నుకోనున్నారు. ఈ పదవికి ముఖ్యంగా పల్నాడు జిల్లా పరిధిలో నలుగురు టీడీపీ సీనియర్ నాయకులు పోటీలో ఉన్నారు.

కోడెల వ్యతిరేకికి కన్నా మద్దతు

ఛైర్మన్ పదవి కోసం సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు పోటీ పడుతున్నారు. ఈయనకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మద్దతిస్తున్నారు. కోటేశ్వరరావు మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావుకు వ్యతిరేకిగా ముద్రపడ్డారు. ఎంపీ లావు మద్దతుతో కోటేశ్వరరావే ఛైర్మన్ అవుతారని ఆయన వర్గం ప్రచారం చేసుకుంటోంది. అయితే గోగినేని గత ఐదేళ్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అధికారం అనుభవించి ఎన్నికల నోటిఫికేషన్ తరువాత పచ్చకండువా కప్పుకున్నారని ఆయన వ్యతిరేక వర్గం ప్రచారం చేస్తోంది. గోగినేనికి పదవి ఇవ్వద్దని టీడీపీ అధిష్టానానికి పెద్దఎత్తున ఫిర్యాదులందాయని సమాచారం.

ఎమ్మెల్యేల పట్టు

ప్రాజెక్ట్ ఛైర్మన్ పదవి తమ వర్గానికే కావాలంటూ పల్నాడు జిల్లాకు చెందిన మరో ముగ్గురు ఎమ్మెల్యేలు తీవ్రంగా పట్టుబడుతున్నారు. నరసరావుపేటకు చెందిన సీనియర్ నేత, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి కోసం ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు యత్నిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆయన పులిమిని వెంటబెట్టుకొని నారా లోకేష్‌నూ కలిశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా అధిష్టానాన్ని ఒప్పించే యత్నాలు చేస్తున్నట్టు సమాచారం. గురజాల నియోజకవర్గానికి చెందిన పులుకూరి కాంతారావుకు ఛైర్మన్ పదవి ఇవ్వాలని యరపతినేని శ్రీనివాసరావు యత్నిస్తున్నారు. రైల్వే కాంట్రాక్ట్ పనులు చేసే కాంతారావు గతంలో గురజాల టీడీపీ ఎమ్మెల్యే సీటు కోసం పోటీపడ్డారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అదే నియోజకవర్గానికి చెందిన పంగులూరి అంజయ్య కోసం లాబీ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇలా నలుగురు ఎమ్మెల్యేలు తమ వర్గానికే ఛైర్మన్ పదవి కావాలంటూ అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నట్టు తెలుస్తోంది.

చంద్రబాబుదే తుది నిర్ణయం..

ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ పదవి ఎంపిక బాధ్యతలను అధిష్టానం ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటికి అప్పగించింది. ఎమ్మెల్యేలు, రేస్‌లో ఉన్న డీసీ ఛైర్మన్లతో బుధవారం మంత్రి సమావేశమయ్యారు. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఛైర్మన్ ఎంపికను చంద్రబాబుకు అప్పగిద్దామని గొట్టిపాటి చెప్పినట్టు సమాచారం. ఆశావహులు చంద్రబాబు, లోకేష్‌లను ప్రసన్నం చేసుకొనే పనిలో నిమగ్నమయ్యారు.

జనసేన కార్యకర్తలకు మొండి చెయ్యి

సాగునీటి సంఘ ఎన్నికలలో జనసేన పార్టీకి తెలుగుదేశం నాయకులు ప్రాధాన్యం ఇవ్వకపోవడం చర్చనీయాంశమైంది. సాగునీటి ఎన్నికలలో కూటమిలో భాగస్వామి అయిన జనసేన కార్యకర్తలు, నాయకులను కనీసం సంప్రదించకుండా తెలుగుదేశం పార్టీ నేతలు ఏకపక్షంగా వ్యవహరించారని జనసేన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఒక్క డీసీ అధ్యక్ష పదవి కూడా కేటాయించలేదని, కేవలం ఉపాధ్యక్ష, మెంటర్ల పదవులు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బీజేపీకీ కనీస ప్రాతినిధ్యం ఇవ్వలేదని వాపోతున్నారు. తెలుగుదేశం పార్టీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని జనసేన, బీజేపీ నేతలు రుసరుసలాడుతున్నారు.

నా మార్గం కమ్యూనిజం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ

సాక్షి అమరావతి: తన మార్గం కమ్యూనిజమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. విశాలాంధ్ర ప్రచురించిన 'దీపిక' రచన ద్వారా కేంద్ర అవార్డును అందుకోవడం గర్వకారణమన్నారు. విజయవాడ విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో గురువారం చంద్రం బిల్డింగ్స్‌లో లక్ష్మీనారాయణకు సన్మానం చేశారు. 1974 నుంచి అరసంలో ఉన్న తనకు విశాలాంధ్రతో అనుబంధం కొనసాగుతోందన్నారు. 150కిపైగా పుస్తకాలకు సంకలనకర్తగాను, గౌరవ సంపాదకులుగా వ్యవహరించానని అన్నారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాహిత్య, సాంస్కృతి రంగాల్లో మార్పులు రావాలని పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం మరింత బలపడాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, విశాలాంధ్ర దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు, పి.హరినాథ్‌రెడ్డి, చావా రవి తదితరులు మాట్లాడుతూ.. లక్ష్మీనారాయణకు ఈ అవార్డు రావడం గర్వకారణమన్నారు. ఆయన్ను అభినందించారు.



పెనుగొండ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

ఆక్రమణల 'వెల్లువ'!

- కూటమి నేతల గుప్పెట్లో కాలవలు, వంకలు
- ఆరు మాసాల్లోనే రోడ్లపక్క స్థలాలన్నీ కబ్జా
- చర్యలు చేపట్టని అధికారులు
- భవిష్యత్‌లో సత్తెనపల్లికి వరద ముప్పు?

సత్తెనపల్లి ఆక్రమణలమయమవుతోంది. భారీ వర్షం వస్తే పట్టణం ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. గతంలో వర్ష బీభత్సానికి ఇళ్లల్లోకి వర్షం నీరు చేరడంతో వేలమంది నిరాశ్రయులయ్యారు. వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించి ఆహార ప్యాకెట్లు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి కారణం ఆక్రమణలే. దీనికితోడు డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో సత్తెనపల్లికి వరద ప్రమాదం పొంచి ఉంది. అయినా మున్సిపల్ అధికారులు ఆక్రమణలు తొలగించే యత్నాలు మాత్రం చేయడంలేదు.

సత్తెనపల్లి: కూటమి నేతల అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. సత్తెనపల్లి పట్టణంలో కాలువలు, కనిపించిన మున్సిపల్ స్థలాలను ఆక్రమించేస్తున్నారు. ముఖ్యంగా రోడ్డు పక్కన స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. చెత్తాచెదారంతో మురుగు కాలువలు, డ్రెయినేజీలు పేరుకు పోతున్నాయి. అక్రమ కట్టడాలతో కాలువలు కుచించుకుపోయాయి. ప్రధానంగా పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన సిమెంట్ రహదారి పక్కన డ్రెయినేజీపై భారీగా షెడ్లు వెలిశాయి. ఈ రోడ్‌లో రాకపోకలు సాగించాలంటే ప్రజలు అవస్థలు పడాల్సిందే. కేవలం ఆరు నెలల్లోనే రోడ్డు మొత్తం ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసినా వాటిని తొలగించే సాహసం మున్సిపల్ అధికారులు చేయలేకపోతున్నారు. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు మరింత రెచ్చిపోతూ ఖాళీ స్థలం కనిపిస్తే వెంటనే షెడ్లు వేసేస్తున్నారు. గుంటూరు రోడ్‌లోని ఆర్ అండ్‌బీ


పట్టణంలోని 14వ వార్డులో మున్సిపల్ స్థలంలో పట్టపగలే షెడ్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

బంగ్లాకు ఎదురు రోడ్డు పక్కన ఇటీవల ఆక్రమణలు పెరిగి షెడ్లు దర్శనమిస్తున్నాయి. రహదారిపై నుంచి రాకపోకలు సాగించే సమయంలో పెద్ద వాహనం వస్తే తప్పుకోవడానికి కూడా అవకాశం లేకుండా షెడ్లు వేయడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పట్టణంలోని 14వ వార్డు యర్రం వెంకటేశ్వరరెడ్డి కాంప్లెక్స్ పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకొని కొద్దిపాటి మున్సిపల్ స్థలాన్ని కూటమి నేతల పేరు చెప్పి కొందరు అక్రమార్కులు గురువారం ఆక్రమించి అక్కడ పట్టపగలే షెడ్డు ఏర్పాటు చేశారు. ఇలా పట్టణంలో మున్సిపల్ స్థలాలు, డ్రెయినేజీ కాలువలు, రహదారులు పూర్తిగా కుచించుకుపోవడంతో నీటి పారుదలకు ఆటంకం కలుగుతోంది. ఫలితంగా చిన్నపాటి వర్షానికీ లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. 25 సెంటీమీటర్ల వర్షం కురిస్తే సత్తెనపల్లి పట్టణం మొత్తం జలదిగ్బంధంలో చిక్కుకుంటుంది. కాలువలు, రహదారుల ఆక్రమణలే ఈ విపత్తుకు కారణంగా మారుతున్నాయి. ఆక్రమణలను అరికట్టకపోతే భవిష్యత్తులో సత్తెనపల్లికి వరద ముప్పు పొంచి ఉంటుంది.

క్లుప్తంగా

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగుల ధర్నా



నరసరావుపేట: విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణను విరమించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బరంపేటలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం గేటు ముందు ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో 'ధర్నా' నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎన్‌సీసీఓఈఈ పిలుపు మేరకే స్పందించిన విద్యుత్ ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. విద్యుత్ ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి, జేఏసీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యాచరణ సమితి సభ్యులు ఆర్.బంగారయ్య, జేఏసీ నాయకులు కె.రవిశంకర్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాదరావు కేవీఆర్ఎస్ శ్రీనివాసరావు, అన్ని వర్గాల విద్యుత్ ఉద్యోగులు, మహిళ ఉద్యోగులూ పాల్గొన్నారు.

41.2 మిల్లీమీటర్ల వర్షం

నరసరావుపేట: తుఫాన్ ప్రభావంతో గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో ఏడు మండలాలు మినహా మిగతా 21 మండలాల్లో 41.2 మిల్లీమీటర్ల వర్షం పడినట్లు వాతావరణ శాఖ అధికారులు గురువారం తెలిపారు. అత్యధికంగా నరసరావుపేటలో 7.4 మిల్లీమీటర్ల వర్షం పడగా, దుర్గిలో 2.0మి.మీ, రెంటచింతలలో 0.6, గురజాలలో 1.4, దాచేపల్లిలో 4.0, పిడుగురాళ్లలో 2.4, మాచవరంలో 1.2, బెల్లంకొండలో 0.8, అమరావతిలో 0.6, పెదకూరపాడులో 1.0, సత్తెనపల్లిలో 1.2, రాజుపాలెంలో 1.0, నకరికల్లులో 1.0, వినుకొండలో 1.4, నూజెండ్లలో 5.4, శావల్యాపురంలో 0.8, ఈపూరులో 1.8, రొంపిచర్లలో 2.0, ముప్పాళ్లలో 1.4, చిలకలూరిపేటలో 2.0, యడ్లపాడులో 1.8 మి.మీ వర్షం కురిసింది. అయితే ఈ వర్షం ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో జల్లులకే పరిమితమైనా, రైతులు తాము పండించిన ధాన్యం, ఇతర పంటలను వర్షానికి తడవకుండా చేసుకునేందుకు నానా పాట్లు పడ్డారు. దాచేపల్లి నడికుడి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆరబోసుకున్న మూడు వేల బస్తాల ధాన్యం వర్షానికి తడిసింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఏపీపీఎస్ఎం అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగిరెడ్డి

సత్తెనపల్లి: ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్(ఏపీపీఎస్ఎం) అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్తెనపల్లికి చెందిన భవనం నాగిరెడ్డి, రాష్ట్ర అడ్వైజర్‌గా క్రోసూరుకు చెందిన తిప్పిరెడ్డి జైనేంద్రారెడ్డి ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల ప్రైవేట్ పాఠశాల డైరెక్టర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీజే ధన్ హాజరై మాట్లాడారు. ఈనెల 29న కేఎల్ యూనివర్సిటీలో రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ సమావేశం విజయవంతంపై చర్చించారు. సమావేశానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరవుతారని, ప్రైవేటు పాఠశాలల సమస్యలపై చర్చిస్తారని వెల్లడించారు. సత్తెనపల్లి పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాల డైరెక్టర్లు అందరూ హాజరు కావాలని కోరారు. జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎంపికైన భవనం నాగిరెడ్డి, రాష్ట్ర అడ్వైజర్‌గా ఎంపికైన తిప్పిరెడ్డి జైనేంద్రారెడ్డిలను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. సమావేశంలో సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు మహబూబ్ సుభాని, పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు నోముల కోటేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.


సత్కారం అందుకున్న నాగిరెడ్డి, జైనేంద్రారెడ్డిలతో పీజే ధన్, డైరెక్టర్లు

విద్యార్థులతో నమోదు చేయించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చా కార్యక్రమానికి జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని హైస్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో నమోదు చేయించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను నమోదు చేయించాలని సూచించారు. దీనిని పర్యవేక్షించేందుకు గుంటూరు జిల్లాకు నోడల్ అధికారిగా డైట్ అధ్యాపకుడు డాక్టర్ కె.ప్రసాద్‌ను నియమించామని తెలిపారు. నమోదుకు ఇన్నోవేటివ్ ఇండియా.మైజీవోవీ.ఇన్ సైట్‌ను సందర్శించాలని, వివరాలకు నోడల్ అధికారిని 80192 07528 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శికి కార్మికుల వినతి



తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు, నాయకులు గురువారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజన్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. 2014లో కోర్టు ఆదేశాల ప్రకారం యజమానులు దాదాపు రూ.42.93 కోట్లు కార్మికులకు చెల్లించాల్సి ఉందన్నారు. ఆ మొత్తానికి 12 శాతం వడ్డీని కలిపి రెండు నెలల్లో ఇవ్వాలని కోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీలో 333 మంది కార్మికులు ఉండగా, దాదాపు సగం మంది అనారోగ్యం, అర్థాకలితో మృతి చెందారని తెలిపారు. ఒకప్పుడు ఎంతో ఘనంగా బతికిన కార్మికులు నేడు ఆర్థిక బాధలతో, కుటుంబ పోషణ కోసం తమకు నైపుణ్యం లేని పనులకు వెళ్తూ కడుపు నింపుకొంటున్నారని యువరాజన్‌కు వివరించారు. తగిన న్యాయం చేస్తానని యువరాజన్ హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

ఎస్పీ కంచి శ్రీనివాసరావు

సత్తెనపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సత్తెనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసును గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ అవేర్ కార్యక్రమం ద్వారా సైబర్ నేరాలపై అన్ని విద్యా సంస్థలలో, గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. బ్లాక్ స్పాట్ల గుర్తింపు, స్టాపర్ల ఏర్పాటు, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహణ తదితర కార్యక్రమాలు చేపట్టి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సబ్ డివిజన్ ఆఫీసుకు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావుకు పలు సూచనలు చేశారు. తనిఖీలలో భాగంగా సబ్ డివిజన్ ఆఫీసు పరిసరాలను, భవనాన్ని పరిశీలించారు. ఆయనతోపాటు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు, సత్తెనపల్లి టౌన్ సీఐ బి.బ్రహ్మయ్య, సత్తెనపల్లి రూరల్ సీఐ ఎమ్‌వి.సుబ్బారావు, సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్ఓ పొలూరి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ -2 శరత్ బాబు, సత్తెనపల్లి టౌన్ ఎస్ఐలు ఎం. సంధ్యారాణి, పవన్‌కుమార్, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్‌అమీనుద్దీన్ తదితరులు ఉన్నారు.


డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

పెనుగొండకు అవార్డు ప్రశంసనీయం : ఈదర

నరసరావుపేట: ప్రముఖ అభ్యుదయ రచయిత, కవి, విమర్శకుడు, అరసం జాతీయనేత, న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక కావడం పల్నాడు జిల్లా సాహితీ లోకానికి గర్వకారణమని అశ్లీలతా ప్రతిఘటనా వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పెనుగొండ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో చురుకైన కార్యకర్తని కొనియాడారు. 1989లో అశ్లీలతా ప్రతిఘటన వేదిక ఏర్పాటు, 1995 ప్రాంతంలో అప్పటి అశ్లీల నవలా రచయితలపై కోర్టులో కేసు వేసి నోటీసులు జారీచేసి వారిని కాళ్ల బేరానికి రప్పించి అశ్లీల నవలలు రాయబోమని లిఖితపూర్వక హామీలు ఇప్పించుటలోనూ, విరసం రుక్మిణితోపాటు పెనుగొండ కీలక పాత్ర పోషించారని గోపీచంద్ తెలిపారు. అశ్లీల డాన్సులను ప్రతిఘటించటంలోనూ, గ్రంథాలయాల నుంచి ఏడు అశ్లీల నవలలను నిషేధింపజేయడంలోనూ ప్రముఖ పాత్ర పోషించారని ప్రశంసించారు. ఈ ఏడాది ఆరంభంలో తాను వెలువరించిన 'కామోత్సవ దహనం' పుస్తకాన్ని కొత్తపల్లి రవిబాబుతోపాటు పెనుగొండ సహ సంపాదకత్వం వహించారని గోపీచంద్ గుర్తు చేశారు. శ్రీశ్రీ సాహిత్యానికి వీరాభిమాని అయిన పెనుగొండను ప్రధాన ఉపన్యాసకునిగా పిలిపించి నాటి పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సత్కరించారని పేర్కొన్నారు.

పోటాపోటీగా ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

గురజాల/గురజాల రూరల్ : పట్టణంలోని పాత పాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఎద్దుల బల ప్రదర్శనలో గురువారం ఆరు పళ్ల జతల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను వైద్యుడు చల్లగుండ్ల శ్రీనివాస్ ప్రారంభించారు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పాతమల్లాయిపాలెంకు చెందిన సిద్దంశెట్టి సామ్రాజ్యం ఎద్దుల జత 5201.3 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం, కృష్ణాజిల్లా వెదుళ్లపల్లికి చెందిన వల్లభనేని మోహన్‌రావు, గుంటూరు జిల్లా మేడికొండురు మండలం పాలడుగుకు చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, శాఖమూరి విజయ పవన్ కుమార్ ఎడ్ల జతలు 5,000 అడుగుల దూరం లాగి రెండో స్థానం, గుంటూరు జిల్లా తూళ్లురుకు చెందన మోదుగుల రామిరెడ్డి, గుంటూరు జిల్లా కోల్లిపరకు చెందిన గుదిబండ మాధవ రెడ్డి ఎడ్ల జత 4,600 అడుగుల దూరం లాగి మూడో స్థానం సాధించాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన ఎడ్ల జత 4,324 అడుగుల దూరం లాగి నాలుగో స్థానం, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన లింగా ధరణీ చౌదరి ఎడ్ల జత 4,256 అడుగులు లాగి ఐదో స్థానం, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంకు చెందిన కె.హుస్సేన్ ఎడ్ల జత 4,077 అడుగుల దూరం లాగి ఆరోస్థానం, పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్ల జత 4,000 అడుగుల దూరం లాగి ఏడో స్థానం కైవసం చేసుకున్నట్టు కమిటీ నిర్వహకులు తెలిపారు. శుక్రవారం నాలుగు పళ్ల జతల పోటీలు నిర్వహిస్తామని వివరించారు.


చల్లగుండ్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కమిటీ నిర్వహకులు

ముగిసిన క్రీడా పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ వేదికగా జిల్లాలోని విద్యార్థినులకు రెండు రోజులపాటు జరిగిన జిల్లాస్థాయి 27వ బాలికల స్పోర్ట్స్-గేమ్స్ మీట్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సత్తా చాటిన గుంటూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ చాపియన్‌షిప్ సాధించింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ఉషారాణి మాట్లాడుతూ... క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణతో విద్యార్థినులు రాణించారని అన్నారు. తమ కళాశాలకు ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు వ్యక్తిగత విభాగంలోనూ చాంపియన్‌షిప్ దక్కిందని వివరించారు. వ్యక్తిగత విభాగంలో ఈసీఈ విద్యార్థిని కె. నవ్య విజేతగా నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా వివిధ విభాగాల వారీగా ఖో-ఖోలో గుంటూరు మహిళా పాలిటెక్నిక్, వాలీబాల్‌లో సెయింట్ మేరీస్, బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో సాయి తిరుమల, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సెయింట్ మేరీస్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో హిందూ కళాశాల, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో గుంటూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విన్నర్లుగా నిలవడంతోపాటు అథ్లెటిక్స్‌లో బహుమతులు గెలుచుకున్నారని చెప్పారు. దీంతో పాటు పాలిటెక్నిక్ కళాశాలల్లోని సిబ్బందికి నిర్వహించిన టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీల్లో పొన్నూరు, గుంటూరు కళాశాలలు విన్నర్స్, రన్నర్లుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న విద్యార్థినుల బృందంతో ప్రిన్సిపల్ ఉషారాణి.

హత్య కేసులో నిందితులు అరెస్టు

పట్నంబజారు: యువకుడిపై దాడి చేసి హతమార్చిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ వై.వీరసోమయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 17తేదీ రాత్రి తెనాలి చెంచుపేటకు చెందిన చప్పిడి దీపక్ (27)ను కొంత మంది వ్యక్తులు తీవ్రంగా గాయపరిచి గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించగా అతడు మృతి చెందాడు. జీజీహెచ్ అధికారుల ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న పోలీసులు.. మృతుడు దీపక్ అలియాస్ నానిగా గుర్తించారు. గత ఏప్రిల్‌లో తెనాలిలో స్నేహితుడు గద్దల కిరణ్ రూ. 54 వేలను దీపక్‌కు ఇచ్చాడు. అప్పటి నుండి డబ్బులు అడుగుతుంటే దీపక్ మాట దాటవేస్తూ వస్తున్నాడు. కిరణ్ ఈ నెల 16వ తేదీ రాత్రి దీపక్‌ను తెనాలి నుంచి మాయమాటలు చెప్పి బార్‌లో మద్యం తాగించాడు. గుంటూరులో మందు పార్టీ ఉందని చెప్పి నమ్మబలికాడు. అప్పటికే ఉద్దేశపూర్వకంగా హత్య చేయాలని పక్కా ప్రణాళికతో ఉన్న కిరణ్.. తన స్నేహితులు లాలాపేటకు చెందిన బూసా రవిశంకర్, పాతగుంటూరు గాంధీ బొమ్మ సెంటర్‌కు చెందిన షేక్ అక్బర్, పాతగుంటూరు కుమ్మరి బజారుకు చెందిన నల్లమేకల అశోక్, నల్లమేకల గోపి, వినోభానగర్‌కు చెందిన షేక్ ఫెరోజ్, బాలాజీనగర్‌కు చెందిన మాల్యా వెంకట సాయికుమార్‌లు.... బాలాజీనగర్ జీరో లైను రాజీవ్ గృహకల్ప సమీపంలోని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లారు. పథకం ప్రకారం మరింత మద్యం తాగించి తనకు రావాల్సిన నగదు గురించి దీపక్‌ను కిరణ్ అడిగాడు. ఇప్పుడు లేవని, తరువాత ఇస్తానని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఈ నేపథ్యంలో కిరణ్, దీపక్ మధ్య ఘర్షణ జరిగింది. మరో నిందితుడు రవిశంకర్ మెడలోని గోల్డ్‌చైన్‌ను సైతం దీపక్ లాగడంతో తెగిపోయింది. చైన్ ఒక ముక్క రవిశంకర్ చేతికి, మరో ముక్క దీపక్ వద్ద ఉండటంతో ఇవ్వమని అడగ్గా ఈ విషయంలో వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో గద్దల కిరణ్, రవిశంకర్, మిగిలిన వారందరూ కలిసి కర్రలు, బెల్టుతో క్రూరంగా కొట్టి గాయపరిచారు. 16వ తేదీ అర్ధరాత్రి 2 గంటల సమయంలో స్పృహ తప్పి కింద పడిన దీపక్‌ను గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లి చప్పిడి వెంకటరెడ్డి పేరుతో చేర్పించారు. తర్వాత పరారయ్యారు. చికిత్స పొందుతూ 17వ తేదీ ఉదయం దీపక్ మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రశేఖరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నందివెలుగు రోడ్డులోని వాటర్ ట్యాంకుల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. అప్పుడు ఈ హత్యకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సైలు షేక్ అబ్దుల్ రహమాన్, ఎస్.సి. ప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు కె.కోటేశ్వరరావు, ఎం.డి.నూరుద్దీన్, కె.చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు జి.శ్రీనివాస్, పి.మురళీలను అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్ఓ వీరసోమయ్య

జిల్లా ఖోఖో జట్టు శిక్షణ పూర్తి

జె.పంగులూరు: స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో గత 20 రోజుల నుంచి ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యాన అండర్-19 ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్టు శిక్షణ తీసుకుంటోంది. గురువారం రాష్ట్ర ఖోఖో కార్యదర్శి, కళాశాల పీడీ మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ముగింపు జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న జట్టు ఈనెల 20, 21, 22 తేదీల్లో తిరుపతి జిల్లా పుత్తూరులో జరిగే అండర్-19 బాలుర స్కూల్ గేమ్స్ పోటీల్లో ఖోఖో పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో జట్టు మంచి ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని కోరారు. అనంతరం పీడీ సీతారామిరెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు, కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి సహకారంలో శిక్షణ జరిగినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

నరసరావుపేటటౌన్/నరసరావుపేట: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పెద్ద చెరువు ఏడో లైనుకు చెందిన ఇర్ల శంకర్(17) తెల్లవారుజామున టీ తాగేందుకు ఇంటి నుంచి బజారుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో రోడ్డుపై తెగి పడి ఉన్న విద్యుత్ తీగను పక్కకు తొలగించేందుకు పట్టుకున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు, ఎస్ఐ హరిబాబు, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అర్ధరాత్రి విద్యుత్ తీగ తెగి పడటంతో దాన్ని పట్టుకొని ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి తల్లి ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


మరణించిన ఇర్ల శంకర్

రూ.పది లక్షల నష్టపరిహారం అందించాలి

విద్యుదాఘాతంతో మృతి చెందినన ఇర్ల శంకర్ కుటుంబానికి తక్షణమే రూ.10 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్‌లోని మార్చురీలో ఉన్న మృతదేహాన్ని గురువారం నాయకులతో కలిసి ఆయన సందర్శించి ఆ కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తక్షణ పరిహారం అందించాలని కోరారు. విద్యుత్ శాఖ ఏఈ ప్రకటించిన రూ.5 లక్షల నష్టపరిహారం సరిపోదని పేర్కొన్నారు. గోపిరెడ్డి వెంట గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అచ్చి శివకోటి, వేముల శివ, షేక్ మాబు, తురక నాగుల్ మీరా, కోట చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

విద్యుత్ ఆదాతో భావితరాలకు మేలు

గుంటూరు వెస్ట్: భావితరాలు మనుగడ సాగించాలంటే ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే విద్యుత్ ఆదా చేయాల్సిన సామాజిక బాధ్యత ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ర్యాలీని కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ ఆదాపై అనేక అవగహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తక్కువ విద్యుత్ వినియోగంతో పనిచేసే గృహోపకరణాలు ప్రజలు వినియోగించాలని సూచించారు. సౌర విద్యుత్‌ను కూడా విస్తృతంగా ఉపయోగించుకోవాలి. పీఎం సూర్య గృహ పథకం కింద జిల్లాలో ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు ఇప్పటి వరకు 5,900 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 594 మంది ఇన్‌స్టాలేషన్ చేయించుకున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారంతో ఈ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. చిత్రలేఖనం, వ్యాస రచన, వకృత్వ పోటీల్లో విజేతలను అభినందించారు. వీరిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 10 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతులకు 48 గంటలలోపే వారి ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నామని తెలిపారు. 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యానికి కూడా ఎంఎస్పీ ధర అందిస్తున్నామని చెప్పారు. ఎంత ధాన్యాన్నైనా కొంటామని కలెక్టర్ వివరించారు. అనంతరం ఎస్‌బీఐ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అధికారులతో, ప్రజలతో విద్యుత్ ఆదాపై కలెక్టర్, జేసీ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఏవీఎల్ఎస్ మూర్తి, అధికారులు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

166 గోవా మద్యం బాటిళ్లు స్వాధీనం

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీలో ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన ఇట్లా శ్రావణి అలియాస్ దుర్గను అదుపులోకి తీసున్నట్లు ఎక్సైజ్ ఎస్సై బి.శ్రీహరి గురువారం తెలిపారు. ఆమె వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 166 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.